క్లుప్తంగా

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తాను 77 జాతీయ ఉద్యమ ఘట్టాలు, 77 మంది ఉద్యమవీరుల కథలు, 77 మంది తెలుగు సాహితీవేత్తల రచనాశైలి, పర్యావరణ పరిరక్షణపై నినాదాలు, 77 మంది ప్రతిభామూర్తుల బయోగ్రఫీ వంటి వాటిని రచించడంతో పాటు వాటిని విద్యార్థులకు తెలియజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్‌ను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించాలి



కొడవలూరు: జాబ్‌కార్డులు కలిగిన ఎస్సీ, ఎస్టీ కూలీలందరికీ విధిగా ఉపాధి పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటాయించిన కొలతల ప్రకారం పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎఫ్ఏలదేనన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు సోక్ పిట్స్ నిర్మించుకుంటే ఉపాధి హామీ ద్వారా రూ.6 వేలు చెల్లిస్తారన్నారు. ప్రతి లబ్ధిదారుడు విధిగా నిర్మించుకునేలా చూడాలని సూచించారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎక్కువ పనులు గుర్తించడం ద్వారా కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ రాజశేఖర్, టీఏ రియాజ్ పాల్గొన్నారు.

పరిశ్రమలపై అవగాహన

ముత్తుకూరు: పారిశ్రామిక రంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్ అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని స్కూల్ విద్యార్థులకు బుధవారం అదానీ కృష్ణపట్నంపోర్టు, పంటపాళెంలోని అదానీ విల్‌మార్ కంపెనీలను సందర్శించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వచ్చే ఉత్పత్తులు, వాటికి ఉన్న డిమాండ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తామన్నారు. డాక్టర్ రమేష్ బాబు, మహేష్, విశాల్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్తుకూరులో ర్యాలీ

ముత్తుకూరు: మణిపూర్ రాష్ట్రంలో హింసాకాండను ఖండిస్తూ మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముత్తుకూరులో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని శాంతిభద్రతలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

వరి పొలాల పరిశీలన

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెంలో వేరుశనగ, వరి పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివన్నారాయణ, ఏడీఏ విజయకుమార్, డీఆర్‌సీ ఏఓ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి జోత్స్నరాణి తదితరులు రైతులతో మాట్లాడారు. వేసవి దుక్కులతో కలిగే వరి పంటకు కలిగే ప్రయోజనాలు వివరించారు. జీవ నియంత్రణ ఎరువుల వినియోగించే విధానాలను తెలిపారు. వేరుశనగలో విత్తన శుద్ధి, విత్తన మోతాదు, జిప్సం వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు పాల్గొన్నారు.

'వీఓఏ మాకొద్దు'

కోవూరు: సభ్యులను వేధిస్తున్న వీఓఏ వెంకటలక్ష్మి తమకొద్దని, ఆమె స్థానంలో మరొకరిని నియమించుకుంటున్నట్లు గుమ్మళ్లదిబ్బ సంఘబంధం సభ్యులు తీర్మానం చేసినట్లు తెలిపారు. గ్రామంలో సంఘ బంధంలోని వంద మంది ఎస్టీ సభ్యులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏగా వెంకటలక్ష్మి సమావేశాలను సభ్యుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఇంటి వద్ద నిర్వహిస్తోందని చెప్పారు. ఆ సమయంలో ఆమె భర్త మద్యం తాగొచ్చి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా సభ్యులు ఏ రుణం తీసుకున్నా వీఓఏ వెంకటలక్ష్మి లంచం డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా ఆమెను తొలగించి కొత్త వారిని నియమించుకోవాలని తీర్మానం చేసుకున్నామని వివరించారు. సమావేశంలో సంఘ బంధం అధ్యక్ష, కోశాధికారులు వై.మమత, బుజ్జమ్మ, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణపై హర్షం


కాంట్రాక్ట్ అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (టౌన్): 2014 జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో బుధవారం సంబరాలు నిర్వహించారు. బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీకరించి తీపికబురు అందించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10వేల మందికి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందన్నారు. ఈ రోజు కాంట్రాక్ట్ ఉద్యోగులకు పండగ వంటిదన్నారు. విద్యకు పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తాను ఎమ్మెల్సీగా ఉండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌శర్మ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, వంశీగౌతమ్, జిల్లా కోశాధికారి సురేష్‌కుమార్, నాయకులుకిషోర్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు


మాట్లాడుతున్న ఏపీజీఈఎఫ్ నాయకులు

నెల్లూరు (పొగతోట) : ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం వారు ఏపీజీఈఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 జూన్ 2 నాటికి డీఎస్సీ విధానంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు, సచివాలయాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం


అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఎస్ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా అవార్డులు అందుకున్న విద్యుత్ శాఖ అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య బుధవారం ఘనంగా సత్కరించారు. విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో కావలి ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు డీఈఈలు శ్రీధర్, సురేష్ బాబు, ఏఈ సుధాకర్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుటౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశేఖర్ రెడ్డి, బాలచంద్ర, మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అల్తాఫ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి


ఏసీ స్టేడియం వద్ద సుందరీకరించిన కూడలిని పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరంలోని రోడ్డు కూడళ్లు, డివైడర్ల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని మేయర్ స్రవంతి అధికారులకు సూచించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానం, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, కొండాయపాళెంగేటు కూడలి, తదితర ప్రాంతాల్లో చేపడుతున్న డివైడర్ల సుందరీకరణ పనులను బుధవారం మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూడళ్లు, డివైడర్లను ఆధునికీకరించి మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ కూడలి నుంచి కేవీఆర్ పెట్రోల్‌బంక్ కూడలి వరకు చేపడుతున్న డివైడర్ల సుందరీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నగరంలోని అన్ని ప్రధాన మార్గాల్లో అవసరమైన చోట డివైడర్ల ఆధునికీకరణ, సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 27వడివిజన్ కార్పొరేటర్ మురహరి, 28,33 డివిజన్ ఇన్‌చార్జులు సునీల్, హజరత్‌నాయుడు, అలహరి, విజయ్, కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

23న సినిమా పాటలు, శాస్త్రీయ నృత్య పోటీలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, రఘురామిరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఈ నెల 23న కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, ఏవీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సినిమా పాటలు, శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 77299 42543 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ రఘురామిరెడ్డి, ఎస్ వెంకారెడ్డి, కే శ్రీనివాసులు, విశ్వేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌కు అభినందన



నెల్లూరు (టౌన్): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమామహేశ్వరిని ప్రిన్సిపల్ గిరి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని క్యాంపులు పెట్టి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్‌డీఏ డైరెక్టర్ చేయూత


గిరిజన కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

కోవూరు: మండలంలోని పడుగుపాడు నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న నిరుపేద గిరిజన కుటుంబానికి డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి చేయూతనందించారు. నేతాజీనగర్ గిరిజన కుటుంబానికి చెందిన రిక్షా కార్మికుడు తూపిలి వెంకటరమణయ్య గుండెపోటుతో బుధవారం మరణించాడు. ఆయన దహన సంస్కారాలకు కూడా డబ్బుల్లేవన్న విషయం దినేష్‌రెడ్డికి తెలియడంతో వెంటనే స్పందించి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కవరగిరి శ్రీలత, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బాబురావు, వార్డు సభ్యులు నాగమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి మందిరంలో శ్రావణమాస పూజలు

నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణమాసం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతమ్మకు ప్రతి శుక్రవారం సామూహిక కుంకుమార్చన, ఖడ్గమాల పూజలు నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా బుధవారం తెలిపారు. ఆగస్టు 18, 25, సెప్టెంబరు 1, 8,15 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆగస్టు 31న రాత్రి 7గంటలకు శ్రీవారికి గరుడసేవ, నగరోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ సిబ్బంది పనివేళల్లో మార్పులు

- ఏ,బీ,సీ షిఫ్ట్‌లతో నూతన జాబ్‌చార్ట్

నెల్లూరు(క్రైమ్): ఎండ, వాన, దుమ్ము, ధూళికి ఏకధాటిగా 8గంటల పాటు నిలబడి ట్రాఫిక్ విధుల నిర్వహణ కష్టంతో కూడుకుంది. ట్రాఫిక్ సిబ్బందికి కాస్తా ఊరటనిస్తూ పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యతో పాటు సిబ్బంది ఆరోగ్యం, పనిఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని బుధవారం నుంచి మూడు షిఫ్ట్‌ల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ట్రాఫిక్ సిబ్బందిని ఏ, బీ, సీ షిఫ్ట్‌లుగా విభజించారు. ఏ షిఫ్ట్‌లోని సిబ్బంది ఉదయం 7 నుంచి 11గంటల వరకు, బీ షిఫ్ట్‌లోని సిబ్బంది 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విధులు నిర్వహిస్తారు. తిరిగి ఏ షిఫ్ట్ సిబ్బంది 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, బీ షిఫ్ట్ సిబ్బంది సాయంత్రం 6 నుంచి రాత్రి 10గంటల వరకు విధులు నిర్వహిస్తారు. మధ్యలో ఖాళీగా ఉన్న సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా లేని కొన్ని పాయింట్లలో మాత్రమే సీ షిఫ్ట్‌లోని సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వారు ఉదయం 7 నుంచి 11గంటల వరకు తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తారు. అనంతరం ఇళ్లకు వెళ్లి విశ్రాంతి తీసుకుంటారు. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు విధులు నిర్వహిస్తారు.

రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): 2022–23 విద్యా సంవత్సరంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేసిన వారు, జనరల్ ట్రాన్స్‌ఫర్స్‌లో డిస్టర్బ్ అయిన వారిని రెన్యూవల్ చేయనున్నట్లు డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఈ ఏడాది మార్చి 31 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు, డిస్టర్బ్ అయిన వారు ఈ నెల 19లోగా ప్రిన్సిపల్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపికబురు


నారపరెడ్డి రాజారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై వైఎస్సార్ టీయూసీ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా వేలాది మంది పనిచేస్తున్నారని, వారు ఎప్పుడైనా తమను రెగ్యులర్ చేయకపోతారనే ఆశతో ఉండేవారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు కాంట్రాక్ట్ ఉద్యోగులను ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం స్వాతంత్య్ర దినోత్సవం నాడు కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైల్‌పై సంతకం చేసి తీపి కబురు అందించడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు.

చెముడుగుంటకు మంత్రి రాక నేడు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంటకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.45 గంటలకు స్రిడ్స్ కల్యాణ మండపంలో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. మినీబైపాస్‌లోని జీవీఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిషేధంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏఈఎస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల సమాజంలో గౌరవం కోల్పోవడంతో పాటు కుటుంబాలు నాశనమవుతాయని తెలిపారు. మనసు నియంత్రణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, డా.భాస్కర్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి


గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొగతోటలోని బీసీ సంఘాల కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులుగౌడ్, బీసీ సంఘ నాయకుడు కనకట్ల రఘురాంముదిరాజ్ ఆధ్వర్యంలో సర్దార్ గౌతులచ్చన్న చిత్ర పటానికి బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు లచ్చన్న వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. నగరంలో గౌతు లచ్చన్న కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుడుముల నాగేశ్వరరావుగౌడ్, అన్నం నాగరాజుగౌడ్, దద్దోలు రమణయ్యగౌడ్, మన్యంగౌడ్, శ్రీరాములు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'అరసం' జిల్లా శాఖ ఆవిర్భావం


'కబుర్ల దేవత' కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం


నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా శాఖను ఆ సంఘ జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. నగరంలోని కరెంటాఫీస్ సెంటర్‌లోని రిత్విక్ ఎన్క్లేవ్‌లోని శ్రీవేంకటేశ్వర విద్యాలయంలోని సమావేశ మందిరంలో అరసం ఆవిర్భావ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అరసం' భాషకు, భావానికి కొత్తదారులు ఏర్పరచి విశిష్ట సేవలందించనుందన్నారు. మహాకవి తిక్కన నడయాడిన నేల మీద ఎందరో సాహితీవేత్తల చిరకాల స్వప్నమైన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ సింహపురిలో ఆవిర్భవించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ రచించిన పిల్లల కథల సంపుటి 'కబుర్ల దేవత'ను 'అరసం' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఆవిష్కరించారు. టేకుమళ్ల వెంకటప్పయ్య సమీక్ష చేశారు.

'అరసం' జిల్లా నూతన కార్యవర్గం

అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ పెరుగు రామకృష్ణ, అధ్యక్షుడిగా డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షులుగా టేకుమళ్ల వెంకటప్పయ్య,, టీవీ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కే కరుణశ్రీ, కార్యదర్శిగా అవ్వారు శ్రీధర్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా పాయసం సుబ్రహ్మణ్యం, ఈతకోట సుబ్బారావు, కోశాధికారిగా అన్నం శివకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ నీలం స్వాతి, పీ రమాదేవి, సయ్యద్ నజ్మా, మక్తాల నరేంద్ర, సుధీర్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు.

'పండుటాకులు' షార్ట్‌ఫిల్మ్‌కు జాతీయ అవార్డులు


కళాంజలి అనంత్


ధనుంజయ

నెల్లూరు(బృందావనం): నెల్లూరు కళాంజలి క్రియేషన్స్ రూపొందించిన షార్ట్‌ఫిల్మ్ 'పండుటాకులు'కు జాతీయస్థాయి పోటీల్లో రెండు అవార్డులు లభించాయి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని వీ వరల్డ్ స్టూడియోస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో బెస్ట్ డైరెక్టర్ అవార్డును కళాంజలి అనంత్, బెస్ట్ యాక్టర్ అవార్డును ధనుంజయ అందుకున్నారు. వృద్ధుల జీవితాలను వివరించే ఇతివృత్తంతో చిత్రీకరించిన పండుటాకులు షార్ట్‌ఫిల్మ్‌కు రెండు అవార్డులు రావడం తనకెంతో ఆనందంగా ఉందని అనంత్ తెలిపారు. షార్ట్‌ఫిల్మ్ తారాగణం, సాంకేతిక వర్గం సమష్టి కృషితోనే జాతీయస్థాయి అవార్డులు లభించాయని పేర్కొన్నారు.

పసలేని ఆరోపణలు సోమిరెడ్డి నైజం



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): పసలేని ఆరోపణలు చేయడమే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నైజమని జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య అన్నారు. బుధవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమిరెడ్డీ మట్టి మాఫియాపై బహిరంగ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మట్టి మాఫియాలో సోమిరెడ్డి వాటాపై, ఆయన మంత్రిగా ఉన్న హయాంలో చేసిన అక్రమాలపైన బహిరంగ విచారణకు తాము సిద్ధమని, తమ సవాలను స్వీకరించాలని కోరారు. సోమిరెడ్డి కోటరీలోని వారంతా రౌడీషీటర్లు, దొంగలేనని, వారు చేసే సవాళ్లను తాము స్వీకరించేది లేదన్నారు. సోమిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఏడాదిలో రైల్వేలైన్ అభివృద్ధి పేరుతో అనుమతులు తెచ్చుకుని 60 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని దోచుకున్నారని ఆరోపించారు. మంత్రిగా ఉన్నప్పుడు సోమిరెడ్డి బీసీలమైన తమని ఇబ్బందులు పెట్టారని, అప్పుడు తాము బీసీ నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీసీలు ఎప్పటికీ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లి గూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: చిరుధాన్యాలు మనిషికి అనేక పోషక విలువలను అందిస్తాయని, వాటి సాగుపై రైతులు దృష్టి సారించాలని నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి సూచించారు. మండల కార్యాలయంలో ఆత్మ సౌజన్యంతో బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మారుతీదేవి మాట్లాడుతూ చిరుధాన్యాల్లో కాల్షియం, ఇనుము, ఖనిజ, లవణాలు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని తెలిపారు. అందుకే రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరి, వేరుశనగ, బెండ, మిరప, వంగ తదితర పంటల్లో సమగ్ర ఎరువులు, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆయా పంటల సాగుకు ముందు రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగుపైన రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి శైలజాకుమారి, మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, వీఏఏ షర్మిల తదితరులు పాల్గొన్నారు.